క్లుప్తంగా

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

కొత్తగూడెంఅర్బన్: ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు గ్రంథాలయ వారోత్సవాలను జిల్లా కేంద్ర గ్రంథాలయం ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు కార్యదర్శి వి.అర్జున్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు, పాఠకులకు వివిధ కార్యక్రమాలను నిర్వహించటం జరుగుతుందని తెలిపారు. 14వ తేదీన చాచా నెహ్రూ జయంతి సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు, 15న పద్యాల పోటీ 16న వక్తృత్వపు పోటీ, 17న పుస్తక ప్రదర్శన 18న వ్యాసరచన, 19న మహిళలకు విభిన్న కార్యక్రమాలు, 20న ముగింపు, బహుమతి ప్రదానోత్సవం ఉంటుందని పేర్కొన్నారు. వివరాలకు 9346382604, 96426 00978 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఎంపీడీఓకు సన్మానం



ధన్‌సింగ్‌ను సన్మానిస్తున్న మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది

ఇల్లెందురూరల్: తెలంగాణ పంచాయతీరాజ్ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా చైర్మన్‌గా ఎన్నికైన ఎంపీడీఓ ధన్‌సింగ్‌ను మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది మంగళవారం ఘనంగా సన్మానించింది. కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పంచాయతీరాజ్ ఏఈ రాజు, సీనియర్ అసిస్టెంట్ జానీపాషా, కార్యదర్శులు పాల్గొన్నారు.

సర్వేపై అపోహలను నివృత్తి చేయాలి

ఇల్లెందురూరల్: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై ప్రజల నుంచి వ్యక్తమైన అపోహలను ఎన్యూమరేటర్లు వెంటనే నివృత్తి చేయాలని ఎంపీడీఓ ధన్‌సింగ్ సూచించారు. మండలంలోని విజయలక్ష్మీనగర్, తిలక్‌నగర్, రొంపేడు గ్రామాలలో కుటుంబ సర్వేను మంగళవారం ఆయన పరిశీలించారు. సర్వే ఫారంలో పలు ప్రశ్నలకు ప్రజల నుంచి వ్యక్తమైన అనుమానాలపై ఆయన సమగ్రంగా అవగాహన కల్పించి నివృత్తి చేశారు. సర్వే వివరాలను సమగ్రంగా ఎన్యూమరేటర్లకు తెలిచపర్చి ప్రజలందరూ సహకరించాలని కోరారు.

విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయాలి



విద్యార్థులతో భోజనం చేస్తున్న ఎంఈఓ

కొత్తగూడెంఅర్బన్: విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయాలని కొత్తగూడెం ఎంఈఓ ప్రభుదయాళ్ అన్నారు. మంగళవారం ఆయన రామవరంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. జాతీయ స్థాయిలో నిర్వహించే ఎన్‌ఏఎస్ పరీక్షకు 3వ తరగతి విద్యార్థులను సన్నద్ధం చేయాలని సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజన్నా పరిశీలించి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. వంట కార్మికులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులలో రాత సామర్థ్యాన్ని పెంచాలని, ఇచ్చిన నోట్స్‌లను పంపిణీ చేసి వాటిని ఉపయోగించే విధానాన్ని ఉపాధ్యాయులకు వివరించారు.

ఓసీని సందర్శించిన అధికారులు

టేకులపల్లి: కోల్ కంట్రోల్ అధికారులు డీవీ సుబ్రహ్మణ్యం, సతీష్ బాజ్పేయే, కింగ్షుక్ ముఖర్జీ మంగళవారం కోయగూడెం ఓపెన్ కాస్టులో పర్యటించారు. ఈ సందర్భంగా వారు కేటీసీలో మూతబడిన గని కార్యకలాపాల పురోగతిని తనిఖీ చేసి అధికారులకు సలహాలు, సూచనలు అందజేశారు. కేటీసీ ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. డీజీఎం ఫారెస్ట్ ఆదినారాయణ, ప్రాజెక్ట్ అధికారి గోవిందరావు, మేనేజర్ సౌరబ్ సుమన్, పర్యావరణ అధికారి ధనుంజయరెడ్డి పాల్గొన్నారు.

పంట అమ్మేందుకు పుట్టెడు కష్టాలు

- మార్కెట్‌యార్డు అందుబాటులో లేక అన్నదాతల అవస్థలు
- 45 కిలోమీటర్ల వెళ్తేనే అమ్మకం
- దళారులను ఆశ్రయిస్తున్న రైతులు

పాల్వంచరూరల్: ఆరుగాలం కష్టపడి పండించిన పంట ఉత్పత్తులను అమ్ముకోవడం రైతులకు వ్యయ భారంగా మారింది. జిల్లా కేంద్రానికి 12 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఏజెన్సీ ప్రాంతమైన పాల్వంచ మండలం జిల్లాలో అధిక పంచాయతీలు, విస్తీర్ణం కలిగిన మండలం. ప్రజలు వానాకాలం, వేసవికాలం వివిధ రకాల పంటలను సాగుచేసి పంటలను పండిస్తుంటారు. ఈ పంట ఉత్పత్తులను విక్రయించుకునేందుకు మార్కెట్ యార్డు అందుబాటులో లేక ప్రతీ సంవత్సరం రైతులు పంటలను అమ్ముకునేందుకు ముప్పుతిప్పలు పడుతున్నారు.

మండలంలో పంటల సాగు ఇలా...

రైతులు వానాకాలంలో సుమారు 7వేల ఎకరాల్లో వరిసాగు చేస్తారు. తద్వారా 20వేల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుంది. యాసంగిలో సుమారు 5వేల ఎకరాల్లో వరి సాగవుతుంది. 16.747 మెటిక్ టన్నుల దిగుబడి వస్తుంది. పత్తిపంట సాగు 12.5 వేల ఎకరాల్లో సాగవుతుంది. తద్వారా 12.500 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుంది. మొక్కజొన్న ఎనిమిది వందల ఎకరాల్లో సాగు చేస్తారు. రెండు వేల క్వింటాల దిగుబడి వస్తుంది. 300 ఎకరాల్లో మిర్చి పంట 625 మెట్రిక్ టన్నుల దిగుబడి లభిస్తుంది. ధాన్యం విక్రయాల ద్వారా సంవత్సరానికి రూ.115 కోట్లు, పత్తి రూ.83 కోట్లు, మొక్కజొన్నల విక్రయాల ద్వారా రూ.3కోట్లు, మిర్చి పంట ద్వారా రూ.38 కోట్లు విలువ గల పంట ఉత్పత్తులను రైతులు ప్రతీ సంవత్సరం విక్రయిస్తున్నారు. ఇంత ఆదాయం వస్తున్నా మండలం జిల్లా కేంద్రానికి అనుకుని ఉన్నా ఇక్కడ వ్యవసాయ మార్కెట్ యార్డును ఏర్పాటు చేయకపోవడం ద్వారా రైతులు ప్రతీ సంవత్సరం పంటలను మార్కెట్ యార్డులకు తీసుకెళ్లి విక్రయించాలంటే వ్యయభారం కావడంతో దళారులకు సగం ధరలకు అమ్ముకుని తీవ్రంగా నష్టపోతున్నారు.



రైతు ఇంటివద్ద ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్న దృశ్యం

45కిలోమీటర్లు వెళ్తేనే మార్కెట్ యార్డు...

మండలంలోని చంద్రాలగూడెం గ్రామపంచాయతీలో రైతులు తమ పంటలను జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలోని వ్యవసాయ మార్కెట్ యార్డుకు తీసుకెళ్లి విక్రయించాలంటే 45 కిలోమీటర్ల దూరం ఉంటుంది. అదేవిధంగా దంతలబోరు గ్రామపంచాయతీలోని రైతులకు 35 కిలోమీటర్లు ఉంటుంది. దీంతో రైతులు పంటలను మార్కెట్ యార్డుకు తీసుకెళ్లాలంటే రవాణా ఖర్చు తడిసి మోపెడు అవుతోంది. లారిలో తీసుకెళ్తే టన్నుకు రూ.400 నుంచి 500 ఖర్చు వస్తుంది. ఇలా 20 టన్నులు తీసుకెళ్లాలంటే రూ.8 నుంచి 10వేల వరకు రవాణా ఖర్చు అవుతోంది. దీంతో రైతులు పంటపోలాల్లోనే దళారులకు అమ్ముకుంటున్న పరిస్థితి.



ధాన్యాన్ని మార్కెట్‌కు తీసుకెళ్తున్న లారీ

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటులో జాప్యం...

ధాన్యం సీజన్ వచ్చినా ఇంత వరకు మండలంలో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఇంత వరకు ఏర్పాటు చేయలేదు. ఇలా ప్రతీ సంవతరం వానాకాలం, యాసంగి రెండు సీజన్‌లలో రైతులు ఇదే విపత్కర పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. దీంతో రైతులు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేలోగా సగం మంది రైతులు తమ పంటలను ఇంటివద్దకు వచ్చే దళారులకు తమ పంటలను విక్రయించుకుంటున్నారు. మిర్చి దిగుబడులను రైతులు ఏకంగా ఖమ్మం లేదా గుంటూరు మిర్చి మార్కెట్‌కు తరలించి అమ్ముకుంటున్నారు.

పొలాల్లోనే అమ్ముతున్నాం..



వ్యవసాయ మార్కెట్ అందుబాటులో లేని కారణంగా పంటలను దళారులకు అమ్ముకుని నష్టపోతున్నాం. ధాన్యం దిగుబడులు వచ్చినా ఇంత వరకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయలేదు. మార్కెట్‌కు తీసుకెళ్లి విక్రయించాలంటే రవాణా ఖర్చు అవుతోంది. దీంతో కల్లాల్లోనే వ్యాపారులకు అమ్ముకుంటున్నాం. - తోట రాజశేఖర్, రైతు

దోపిడీకి గురవుతున్నాం..



రైతులు ప్రతీ సంవత్సరం పంటలు విక్రయించాలంటే అష్టకష్టాలు పడాల్సి వస్తోంది. మార్కెట్ యార్డు అందుబాటులో ఉంటే ఈ ప్రాంత రైతులకు మేలు జరుగుతుంది. ప్రతీ సంవత్సరం రైతులు దళారీల దోపిడీకి గురికావాల్సి వస్తోంది. ఇప్పటికైనా వ్యవసాయ మార్కెట్‌ను మండల కేంద్రంలో ఏర్పాటు చేయాలి. అధికారులు, పాలకులు స్పందించాలి. - పాక జనార్దన్, రైతు

రైతులకు న్యాయం చేయాలి..



ఏజెన్సీ ప్రాంతమైన పాల్వంచ మండలంలో రైతులకు వ్యవసాయ మార్కెట్ అందుబాటులో లేకపోవడంతో ప్రతీ సంవత్సరం కొత్తగూడెం, బూర్గంపాడు వ్యవసాయ మార్కెట్‌లకు పంటలను తీసుకవెళ్లి విక్రయించుకుంటున్నారు. అందదూరం వెళ్లలేక ఎక్కువ మంది రైతులు సగం ధరలకే దళారులకు పంట అమ్ముకుని నష్టపోతున్నారు. - ఎస్.వెంకట్‌రెడ్డి, రైతు

సూపర్‌బజార్, బ్యాంకు, బంక్ ఏర్పాటు చేయండి..

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలోని రామవరంలో సూపర్‌బజార్, బ్యాంకుతో పాటు పెట్రోల్ బంక్ ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతానికి పూర్వవైభవం వస్తుందని ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ.రజాక్ తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఏరియా జీఎం ఎం.శాలేం రాజుకు వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ... రామవరం మార్కెట్ సెంటర్‌లో శిథిలావస్థకు చేరిన సింగరేణి సూపర్‌బజార్‌ను తొలగించి ఆ స్థానంలో సూపర్ బజార్‌తో పాటు షాపింగ్ కాంప్లెక్స్, బ్యాంకు, బంక్ ఏర్పాటుకు గతంలోనే ప్రతిపాదనలు ఉన్నాయని తెలిపారు. ఈ మేరకు అధికారులు స్పందించడంతో పాటు వీకే-7 స్టేజీ - 2 అనుమతి కోసం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎండీ.సత్తార్, శనిగరపు కుమార్, సాగర్, సకినాల సమ్మయ్య, గౌస్, రమాకాంత్, ఈశ్వర్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడిగా వీరభద్రం



టేకులపల్లి: ఆదివాసీ హక్కుల పోరాట సమితి - తుడుందెబ్బ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడిగా టేకులపల్లి మండలానికి చెందిన దుగ్గారపు వీరభద్రం ఎన్నికయ్యారు. ఈ మేరకు మంగళవారం ఆయన వివరాలు వెల్లడించారు. జిల్లా కేంద్రంలో జరిగిన మహాసభలో జాతీయ కన్వీనర్ రమణాల లక్ష్మయ్య, వట్టం ఉపేందర్ల సమక్షంలో తన ఎన్నిక జరిగిందని తెలిపారు. డిసెంబర్‌లో రాష్ట్ర మహాసభ నిర్వహించేందుకు తీర్మానం చేయడం జరిగిందని పేర్కొన్నారు. బైలా ప్రణాళిక నిబంధనావళి, క్రమశిక్షణ చర్యలను పాటిస్తూ సంఘాన్ని బలోపేతం చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఎస్టీ వర్గీకరణకు దశల వారీ పోరాటాలు నిర్వహించేందుకు ఆదివాసీలు సిద్ధంగా ఉండాలని కోరారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి దినేష్

టేకులపల్లి: విద్యార్థులు పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని టేకులపల్లి మండల వైద్యాధికారి కందుల దినేష్ అన్నారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకులం, కోయగూడెం ఆశ్రమ పాఠశాలల్లో సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బందితో కలిసి వైద్యశిబిరం నిర్వహించారు. పిల్లలను పరీక్షించి అవసరమైన వారికి మందులను అందజేశారు. మాట్లాడుతూ... ఈ చలికాలంలో వచ్చే వ్యాధులు జలుబు, ఫ్లూ, దగ్గు సైనసైటిస్, బ్రాంకైటిస్, ఆస్తమా వంటి వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సీజన్‌లో శ్వాస సంబంధిత వ్యాధులు ఎక్కువగా వస్తాయన్నారు. పిల్లలు మాస్కు ధరించాలని, చేతులు పరిశుభ్రంగా కడుక్కోవాలని, కూల్ డ్రింక్స్, చల్లటి నీరు, చల్లటి, తీపి పదార్థాలకు దూరంగా ఉండడం మంచిదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రవీందర్, అమర్ సింగ్, ఆరోగ్య విస్తరణ అధికారి దేవా, సూపర్‌వైజర్ నాగుబండి వెంకటేశ్వర్లు, స్టాఫ్ నర్స్ రేష్మ, ఏఎన్‌ఎంలు రమాకుమారి, సులోచన పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారించండి..

సుజాతనగర్: నాయకులగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని లక్ష్మక్కపేటలో తీవ్ర తాగునీటి సమస్య నెలకొంది. మిషన్ భగీరథ నీళ్లు సక్రమంగా రాకపోవడంతో గ్రామస్తులు నానా ఇబ్బందులు పడుతున్నారు. నాలుగైదు రోజులకోసారి వచ్చే మిషన్ భగీరథ నీళ్లతో ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామస్తుల అవసరాల దృష్ట్యా గతంలో ఇక్కడ వాటర్ ట్యాంకు పక్కన అధికారులు ఓ బోరు ఏర్పాటు చేశారు. కానీ ఆ బోరుకు ఇంతవరకు మోటారును బిగించలేదు. కనీసం బోరుకు మోటారును బిగిస్తే నీటి సమస్య కొంతవరకు తీరుతుందని గ్రామస్తులు అంటున్నారు. ప్రస్తుతం గ్రామంలోని 30 కుటుంబాలకు ఒకే చేతిపంపు ఆధారంగా మారింది. ఇప్పటికైనా గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.



బోరును చూపిస్తున్న గ్రామస్తులు

తరుణ్ కుటుంబాన్ని ఆదుకోవాలి



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

జూలూరుపాడు: చింతలతండా గ్రామ పంచాయతీ మల్టీపర్పస్ వర్కర్ బానోత్ తరుణ్ విద్యుత్‌షాక్‌తో మృతి చెందాడని, ఆ కుటుంబానికి రూ. 25 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.గోపాల్‌రావు, మాస్‌లైన్ ప్రజాపంథా పార్టీ మండల కార్యదర్శి బానోత్ ధర్మాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం జూలూరుపాడులో నాయకులు మాట్లాడుతూ.. అధికారులు ఇష్టవచ్చినట్లు మల్టీపర్పస్ వర్కర్లకు పనులు చెబుతున్నారని వాపోయారు. కార్యక్రమంలో పెద్దబోయిన సతీష్, ఎం.రాజశేఖర్, ధన్వంతరావు, ఈర్యా, రాము పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సంతాపం..

చింతలతండా గ్రామ పంచాయతీ మల్టీపర్పస్ వర్కర్ తరుణ్ మంగళవారం ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. విషయం తెలుసుకున్న వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ కొత్తగూడెం ప్రభుత్వాస్పత్రిలో ఉన్న తరుణ్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

ఇల్లెందు: జూలూరుపాడు మండలం చింతల్‌తండాలో మల్టీ పర్పస్ వర్కర్ తరుణ్ విద్యుత్ షాక్‌తో మృతి చెందటాన్ని టీయూసీఐ తీవ్రంగా పరిగణిస్తోందని ఆ సంఘం జిల్లా కార్యదర్శి యాకుబ్ షావలీ అన్నారు. మంగళవారం ఇల్లెందులో ఆయన మాట్లాడుతూ... చింతల్‌తండా పంచాయతీలో మల్టీ పర్పస్ కార్మికుడిగా పని చేస్తున్నాడని అధికారుల నిర్లక్ష్యం కారణంగా విద్యుత్ స్తంభానికి బల్బు ఏర్పాటు చేస్తున్న క్రమంలో చెట్టు కొమ్మను నరుకుతూ విద్యుదాఘాతంతో మృతి చెందాడని తెలిపారు. ఈ సంఘటనకు ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు. ఆయన కుటుంబానికి రూ.25 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని కోరారు.

భిక్షం సేవలు మరువలేనివి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

ఇల్లెందు: మాజీ మున్సిపల్ కౌన్సిలర్ స్టేషన్ బస్తీ వాసీ మేదరి భిక్షం సేవలు మరువలేనివని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. మంగళవారం అనారోగ్యంతో మృతి చెందిన భిక్షం మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కౌన్సిలర్‌గా భిక్షం పట్టణాభివృద్ధికి తన వంతు సేవలు అందించారని తెలిపారు. డానియేల్, లక్ష్మణ్, జాఫర్, చిల్లా శ్రీను, మహబూబ్, బానోతు రవినాయక్, గాలిపల్లి స్వరూప, కమళాబాయి, విజయ భారతి, నిర్మల, వరలక్ష్మి, అనిత, సరస్వతి, సునిత, జాన్సీ, సుశీల, సంగీత, ఇమామ్, ఈశ్వర్ తదితరులు నివాళులు అర్పించిన వారిలో ఉన్నారు.

ఉద్యమకారులకు న్యాయం చేయండి..

కొత్తగూడెంటౌన్: ఉద్యమకారులను ప్రభుత్వం గుర్తించి న్యాయం చేయాలని 1969 తొలిమలి ఉద్యమకారుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు శ్రావణబోయిన నర్సయ్య డిమాండ్ చేశారు. మంగళవారం కొత్తగూడెంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. తొలిమలి ఉద్యమం నుంచి తెలంగాణ ఉద్యమం వరకు పోరాడి అనేక కష్టాలు పడ్డామన్నారు. ఉద్యమకారులను ప్రభుత్వం గుర్తించి తక్షణమే గ్రేడ్-ఏ1 పెన్షన్‌లు మంజూరు చేయాలని, ఉచిత వైద్య సదుపాయం, బస్సు ప్రయాణాల్లో రాయితీలు, డబుల్‌బెడ్ రూం ఇళ్లు ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో ఎం.వలీ బాబు, కూచన కృష్ణారావు, కైల్లి సైమన్, సఫ్తార్‌బేగ్, దేవులపల్లి రమణమూర్తి పాల్గొన్నారు.

అధికారులకు క్వార్టర్ల కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

ఇల్లెందు: ఇల్లెందు ఏరియా జీఎం జాన్ ఆనంద్ ఆదేశాల మేరకు మంగళవారం ఏరియా సింగరేణి అధికారులకు ఏ టైప్ క్వార్టర్ల కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎస్ఓటూ జీఎం కార్యాలయంలో జరిగిన ఈ కౌన్సెలింగ్‌లో ఫ్రెష్ ఎలాట్‌మెంట్, చేంజ్ ఆఫ్ క్వార్టర్ల కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులైన అధికారులకు క్వార్టర్లు కేటాయించారు. ఈ సందర్భంగా ఎస్ఓటూ జీఎం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... అర్హత కలిగిన వారికి క్వార్టర్లు ఎలాట్‌మెంట్ ఉత్తర్వులు జారీ చేస్తామని తెలిపారు. పూర్తి పారదర్శకంగా సిఫార్సులకు తావు లేకుండా నిబంధనలకు అనుగుణంగా క్వార్టర్లు ఇవ్వటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీజీఎం(పర్సనల్) జీవీ మోహన్‌రావు, జూనియర్ అసిస్టెంట్ వీరన్న తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో పనిచేస్తున్న సుమారు 30 వేల మంది కార్మికులకు హైపవర్ వేతనాలు లేదా జీఓ నంబర్ 22 వేతనాలు అమలు చేయాలని మంగళవారం బీఎంఎస్ జాతీయ నాయకులు పి.మాధవనాయక్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... సంస్థలో సుమారు 80శాతం ఎస్సీ కాంట్రాక్ట్ కార్మికులు సుమారు 25 ఏళ్లుగా చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నారని, కోలిండియాలో కాంట్రాక్ట్ కార్మికులకు హైపవర్ వేతనాలు అమలవుతుండగా సింగరేణిలో అమలు కావటం లేదని, ఈ వేతనాలు అమలు చేయాలని విన్నవించారు. మరికొన్ని సమస్యలపై గతేడాది 18 రోజులు సమ్మె చేసినప్పటికీ, లేబర్ కమిషన్ వద్ద చర్చలు జరిపి ఒప్పుకున్న సమస్యలను నేటికీ పరిష్కారానికి నోచుకోలేదన్నారు. స్పందించిన చైర్మన్ సంస్థ ఉన్నతాధికారులతో చర్చించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇనపనూరి నాగేశ్వరరావు, దొడ్డి నిర్మల, ఎడ్ల రాకేష్, లావుడియా సంతోష్, గుర్రం సృజన్, మందా అజయ్, తదితరులు పాల్గొన్నారు.



వెంకటయ్యకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

డీడీలు కట్టినవారు నష్టపోవాల్సిందేనా?



మాట్లాడుతున్న కామేష్

కొత్తగూడెంఅర్బన్: జీఓ నంబర్ 76లో ఇంటి పట్టాల కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతీ ఒక్కరికి ఎన్నికల సమయంలో ఇంటి పట్టాలు ఇస్తానని ఎమ్మెల్యే ఇచ్చిన హామీ ఏమైందని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యర్రా కామేష్ ప్రశ్నించారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ.. కొత్తగూడెం పట్టణంలో ఎన్నో ఏళ్లుగా నివాసముంటున్న వారికి యాజమాన్య హక్కులు కల్పించాలనే ఉద్దేశంతో గత ప్రభుత్వం జీఓ76 ప్రవేశపెట్టగా సుమారు రెండు వేల మందికి పైగా దరఖాస్తులు చేసుకున్నట్లు చెప్పారు. దరఖాస్తుతో పాటు డబ్బులు కూడా కట్టారని ఎన్నికల కోడ్ అమలులోకి రాగానే పట్టాల పంపిణీ ప్రక్రియను నిలిపివేశారని తెలిపారు. ఎన్నికలు అయిపోయి 11 నెలలు దాటినా నేటికీ పట్టాల పంపిణీ ప్రక్రియ ప్రారంభికపోవడంతో ఇళ్ల కొనుగోలు, అమ్మకాలు జరగక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఇంటి పట్టాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గంధం మల్లికార్జునరావు, సాయి, వంగా రవిశంకర్, పోలే కనకరాజు, ఇసం మురళి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో తాగునీటి తిప్పలు

- రోజుల తరబడి మరమ్మతులు
- అవస్థలు పడుతున్న కొత్తగూడెం ప్రజలు
- సరఫరా జరిగితే బురదనీటితో ఇబ్బందులు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం జిల్లా కేంద్రం ఏ గ్రేడ్ మున్సిపాలిటీలో తాగునీటి తిప్పలు తప్పడం లేదు. మరమ్మతుల పేరుతో రోజుల తరబడి నీటి సరఫరాను నిలిపివేయడంతో పట్టణ ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపాలిటీలోని వార్డులోని ప్రజలు 80 శాతం మంది కిన్నెరసాని నీటిని తాగునీరుగా వినియోగిస్తారు. మిగతావారు సింగరేణి, మినరల్ వాటర్‌ను వాడుకుంటారు. అయితే పట్టణ పరిధిలోని సెవెన్‌హిల్స్ ఏరియాలో రెండు వారాల క్రితం ప్రధాన పైపులైన్ లీక్ అయింది. అందులో డ్రెయినేజీ నీరు కలుస్తోందని, మున్సిపల్ ఆధ్వర్యంలో మరమ్మతులు చేపట్టారు. ఈ క్రమంలో గతవారం నాలుగు రోజులు నీటి సరఫరా బంద్ చేశారు. మరమ్మతులు ఇంకా పూర్తి కాలేదని ఈ వారం కూడా నాలుగు రోజులు నీటి సరఫరాను నిలిపివేశారు. దీంతో ఆ ప్రధాన పైపులైన్ ద్వారా నీటి సరఫరా జరిగే ప్రాంతాలైన సెవెన్‌హిల్స్ ఏరియా, కూలీలైన్ ఏరియా, గాజుల రాజం బస్తీ, హనుమాన్ బస్తీ, బూడిదగడ్డ ప్రజలు తాగునీటికి తీవ్రం ఇబ్బందులు పడుతున్నారు. నీటిని విడుదల చేసిన సమయంలో కూడా బురద నీరు వస్తోందని, అవి తాగితే రోగాల బారిన పడడం ఖాయమని స్థానికులు చెబుతున్నారు. కిన్నెరసాని నీటి పైపులైన్ల మరమ్మతులు, మోటారు రిపేర్లు, ఆలం కొనుగోలు కోసమని అక్టోబర్‌లో జరిగిన కౌన్సిల్ సమావేశంలో రూ.26.75 లక్షలు కేటాయించి కౌన్సిల్ సభ్యులు ఆమోదం తెలిపారు. అయినా మున్సిపాలిటీలోని ప్రజల తాగునీటి ఇబ్బందులను పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. పైపులైన్ మరమ్మతులు నామమాత్రంగా నిర్వహించడం వల్లనే మళ్లీ అదే ప్రాంతంలో లీక్ అవుతున్నాయి.



ప్రధాన పైపులైన్ లీక్ అయిన ప్రాంతం

బురద నీరే దిక్కు...

కొత్తగూడెం పట్టణంలో సరఫరా అయ్యే కిన్నెరసాని నీరు బురదగా వస్తున్నాయి. కిన్నెరసాని నీటిని ఇల్లెందు క్రాస్ రోడ్డులోని ఫిల్టర్‌బెడ్‌లో శుద్ధి చేసి సరఫరా చేయాలి. కానీ అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపం కారణంగా నీటిని శుద్ధి చేయకుండానే సరఫరా చేస్తున్నారు. దీంతో అవి తాగిన ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని ఫిల్టర్‌బెడ్‌లో ఆలం, ఇసుకతో నీటిని శుద్ధి చేసిన తరువాత నీటి సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు. ప్రతీనెల ఆలం కొనుగోలుకు రూ.లక్షలు కేటాయిస్తున్నప్పటికీ బురదనీటిని సరఫరా చేయడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఇబ్బంది లేకుండా చర్యలు...

పట్టణ పరిధి సెవెన్‌హిల్స్ ఏరియాలో ప్రధాన పైపులైన్ లీకేజీ కావడం వలన సిబ్బంది మరమ్మతులు చేస్తున్నారు. లీకేజీ వద్ద డ్రెయినేజీ వాటర్ పైపులైన్‌లో కలుస్తుందని రెండోసారి మరమ్మతులు చేస్తున్నారు. తాగునీటి విడుదలకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం.
- శేషాంజన్‌స్వామి, మున్సిపల్ కమిషనర్

ఆకాశంలో మబ్బులు.. ఆందోళనలో రైతులు

పాల్వంచరూరల్: వాతావరణం ఒక్కసారిగా మారి మబ్బులు పట్టడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మండలంలో ఇంకా ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం కాకపోవడంతో వరికోతలు కోసి పంటపొలాల వద్ద ధాన్యం రాశులు పోసుకుని విక్రయించుకోనేందుకు సిద్ధంగా ఉన్న తరుణంలో వాతావరణం చల్లబడటంతో వర్షం వస్తే ధాన్యం తడిసి పోతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో రెడ్డిగూడెం, సోములగూడెం, గుడిపాడు, దంతలబోరు, సంగం, కారెగట్టు గ్రామాల్లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం, జీసీసీ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఫ్లెక్సీలు కట్టారు. కానీ కొనుగోళ్లు ప్రారంభించలేదు. అయితే మంగళవారం ఆకాశంలో మబ్బులు పట్టి చల్లబడటంతో పొలాల్లో ధాన్యం ఆరబోసిన రైతులు కలవరం చెందుతున్నారు. రెడ్డిగూడెం వద్ద కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారు కానీ, కొనుగోళ్లు ప్రారంభించ లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా సోములగూడెం కేంద్రం వద్ద కూడా ఆరుబయట ధాన్యాన్ని ఆరబోసిన రైతులు వర్షం వస్తే ధాన్యం తడిసిపోకుండా పరదాలను కప్పుకున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు. రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని మిల్లర్లు తీసుకోవాల్సి ఉండగా ఇంతవరకు మిల్లర్లు అధికారులతో అగ్రిమెంట్ చేసుకోకపోవడంతో కొనుగోలు ప్రక్రియలో జాప్యం జరుగుతున్నట్లు సమాచారం.



రెడ్డిగూడెంలో ధాన్యం కుప్ప చేస్తున్న రైతు

ఈ విషయమై సొసైటీ కార్యదర్శి శ్రీనివాస్‌ను వివరణ కోరగా.. మండలంలో ఐదు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, ఇప్పుడిప్పుడే రైతులు వరికోతలు కోస్తున్నారు. రెడ్డిగూడెం, సోములగూడెం కేంద్రాల వద్ద శుద్ధి చేసిన ధాన్యం సరిపడా లేని కారణంగా కొనుగోలు చేయడం లేదన్నారు. నిబంధనల మేరకు ధాన్యాన్ని కేంద్రానికి తీసుకొస్తే వెంటనే కొనుగోలు చేయడం జరుగుతుందని చెప్పారు.